# లోక్‌సత్తా పార్టీ

ప్రతికాప్రకటన తేది : 29-01-2007

## కాన్సెప్ట్ స్కూళ్ళ పేరుతో పాఠశాల విద్యని ప్రైవేటీకరించటం అసమంజసం

లోక్‌సత్తా పార్టీ తొలినుండి విద్య, ఆరోగ్య రంగాలని నూతన రాజకీయానికి కేంద్రంగా చేయాలని పోరాడుతున్నది. మన సమాజంలో శతాబ్దాల పర్యంతం పుట్టకతో వివక్షకి గురవుతున్న వర్గాలకి న్యాయం జరగాలంటే విద్య ఒక్కటే అందుకు తగిన సాధనమని లోక్‌సత్తా పార్టీ ప్రగాఢంగా విశ్వసిస్తున్నది. కులంతో, కుటుంబంతో, లింగవివక్షతో, మతంతో, బీదరికంతో సంబంధం లేకుండా పుట్టిన ప్రతిబిడ్డకి మంచి ప్రమాణాల విద్యనిచ్చి, ఆ బిడ్డలని సంపద సృష్టించే యోధులుగా తీర్చిదిద్దకపోతే మన సమాజంలో అంతరాలు పెరుగుతాయని, శాంతి కరువవుతుందని, కోట్లాదిమంది భవిష్యత్తు అంధకారమవుతుందని లోక్‌సత్తా పార్టీ బలంగా వాదిస్తున్నది.

ఈ నేపథ్యంలో ఇటీవల మన రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యమీద కొంత మేరకయినా దృష్టిని పెట్టటం ఆహ్వానించదగ్గ పరిణామంగా లోక్‌సత్తా పార్టీ భావిస్తున్నది. అయితే సంకల్పం ఎలాంటిదయినా ప్రభుత్వవిధాన నిర్ణయాలు పాఠశాల విద్య ప్రైవేటీకరణని ప్రోత్సహించే దిశగా ఉన్నాయి. ఇప్పటికే దేశమంతటా, మన రాష్ట్రంలోను విద్య, ఆరోగ్యరంగాలలో అప్రకటిత ప్రైవేటీకరణ జరిగిపోయింది. ప్రభుత్వ వ్యవస్థ ఈ రంగాలని పూర్తిగా నిర్లక్ష్యం చేయటంతో ప్రజలకి ప్రభుత్వ సంస్థల మీద విశ్వాసం సన్నగిల్లింది. నిరుపేద వ్యవసాయ కూలీలు, రిక్షా కార్మికులు కూడా ప్రతినెలా, ప్రతిబిడ్డకి కొన్ని వందల రూపాయలు ఫీజులు కట్టి ప్రైవేటు స్కూళ్ళకి పిల్లల్ని పంపిస్తున్నారు. కాని చాలా ప్రైవేటు పాఠశాలల్లో కనీస సౌకర్యాలు, తగిన బోధనా సిబ్బంది లేక, బీదపిల్లల వికాసం ఆగిపోతున్నది; వారిలో చాలామంది భవిష్యత్తు సమాధి అవుతున్నది. మన బీదల కడగండ్లకి, రైతుల ఆత్మహత్యలకి కార్పొరేట్ విద్య, కార్పొరేట్ ఆరోగ్యం ప్రధానకారణాలవుతున్నవి.

ఈ పరిస్థితులలో మండలానికి ఒకటి చొప్పున ప్రైవేటు పాఠశాలలని ప్రభుత్వమే ప్రోత్సహించి, అందులో బీదవర్గాల పిల్లలని చేర్పించి, వారికి ఫీజులని ప్రభుత్వమే చెల్లించబూనటం విద్యని పూర్తిగా ప్రైవేటీకరించటమే. నేటి సమాజానికి కావలసింది విద్య, ఆరోగ్యం అందరికీ మంచి ప్రమాణాలతో, ఉచితంగా, జవాబుదారితనంతో అందటం. లోక్‌సత్తా పార్టీ ప్రైవేటు రంగానికి వ్యతిరేకం కాదు. వ్యక్తి స్వేచ్ఛ, ప్రైవేటు పెట్టుబడులు, ఉత్పత్తిలో పోటీ ఉంటేనే ఆర్థిక ప్రగతి సాధ్యమని ప్రజల అవసరాలు తీరతాయని లోక్‌సత్తా పార్టీ విశ్వసిస్తోంది. కాని పుట్టుకతో వచ్చిన అసమానతలు తొలగించటానికి, వివక్షని అంతం చేయటానికి సాధనాలయిన విద్య. ఆరోగ్యం, ప్రైవేటు పాలు కావటం కోట్లాదిమంది భవిష్యత్తుకి అవరోధమవుతుంది. ఇప్పటిదాక జరిగిన ఈ అప్రకటిత ప్రైవేటీకరణని ఇప్పుడు ప్రభుత్వం ఈ రంగాలలో అధికారికంగా చేపట్టటం ఆందోళనకర పరిణామంగా లోక్‌సత్తా పార్టీ భావిస్తున్నది. పెట్టుబడిదారి విధానాన్ని తొలినుంచి ఆమోదించిన సంపన్న దేశాలలో కూడా విద్య, ఆరోగ్యం ప్రధానంగా ప్రభుత్వ బాధ్యతలని గుర్తించారు. ఆ దేశాలలో ప్రైవేటు పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు ఉన్నా అవి ఏనాడూ వ్యాపార కేంద్రాలు కాలేదు. మన సమాజంలో విద్య, ఆరోగ్యం ప్రభుత్వ వైఫల్యాల వల్ల వ్యాపారాలుగా మారిపోయాయి. ఇప్పుడా ఆ వ్యాపారాన్ని మరింత పెంచటం కోసం ప్రభుత్వం విధానాలని రూపొందించటం అసమంజసం.

ఇప్పటికీ ప్రైవేటు విద్యాసంస్థలతో పోలిస్తే మన ప్రభుత్వ పాఠశాలల్లోని అధ్యాపకుల ప్రమాణాలు ఎక్కువ. నేటికి అవినీతి అంటని వర్గం అధ్యాపకులే. అలాంటప్పుడు ప్రభుత్వరంగంలో గణనీయంగా పెట్టుబడులు పెట్టి, అందరికీ విద్యావకాశాలు విధిగా కల్పించి ప్రమాణాలు పెంచటం కోసం విధానాలు రూపొందించే బాధ్యత ప్రభుత్వానిది. ప్రభుత్వ

విద్యకి, ప్రైవేటు విద్యకి అంతరాన్ని తొలగించి, అందరికీ మంచి విద్యని అందించటం ప్రభుత్వకర్తవ్యం. అలా కాక కేవలం డబ్బున్న వాళ్ళకి, ప్రభుత్వ ఫీజులు కట్టినంత కాలం మరికొందరు బీదలకి మాత్రమే ప్రైవేటు విద్యనందించి, ప్రభుత్వ విద్యని నిర్లక్ష్యం చేయబూనటం సమాజానికి ఏ రకమైన ప్రయోజనాన్ని చేకూర్చదు.

2005, 2006 సంవత్సరాలలో పౌర సమాజం నిర్వహించిన విద్యా సర్వేలు (- వార్షిక విద్యాస్థితి నివేదికలు - Annual status of education reports - ASER) ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు రెండూ మన రాష్ట్రంలో విద్యనందించటంలో ఎంతగా విఫలమయ్యాయో రుజువు చేస్తున్నాయి. 11-14 సంవత్సరాల మధ్య వయసు బడి పిల్లలలో 28.5 శాతం మంది పిల్లలు రెండవ తరగతిస్థాయికి చెందిన ఒక చిన్న కథని ఒక్క పేరా కూడా చదవలేకపోతున్నారు! అలాగే 11-14 సంవత్సరాల వయసులో 44.5 శాతం మంది బడి పిల్లలు చిన్న భాగహారం చేయలేకపోగా, 21 శాతం మంది రెండంకెల సంఖ్యల తీసివేత కూడా చేయలేకపోయారు! విశేషమేమంటే, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల మధ్య చెప్పుకోదగ్గ అంతరం లేదని ఈ సర్వేలలో తేలింది. అంటే బాగా ఖరీదయిన పాఠశాలలకి వెళ్ళే సంపన్నుల పిల్లలకి, విద్యావంతులు పిల్లలకి తప్ప, బీద పిల్లలకి మన రాష్ట్రంలోను, దేశంలో చాలా ప్రాంతాలలోను కనీసం ప్రమాణాల విద్య కూడా అందటం లేదు. అలాంటప్పుడు పాఠశాల విద్యని ప్రైవేటీకరించటం పరిష్కారంగా ప్రభుత్వం ఎలా భావిస్తున్నదో అర్థం కావటం లేదు.

పాఠశాల విద్యని అందరు పిల్లలకి మంచి ప్రమాణాలతో అందించాలంటే ప్రభుత్వం అందుకు యుద్ధ ప్రాతిపదికన పూనుకోవటం అవసరం. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల తేడా లేకుండా ఒకే సిలబస్‌ని, ఒకే మాధ్యమాన్ని ప్రవేశపెట్టటం; కనీసం రు. 20,000 కోట్ల రూపాయలు అదనపు పెట్టుబడిని ఐదేళ్ళలో పాఠశాలల కోసం పెట్టటం; విధిగా ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతి గదులు, ఐదుగురు అధ్యాపకులు ఉండే ఏర్పాటు చేయటం; అధ్యాపకుల శిక్షణ ప్రమాణాలు పెంచటం; హేతుబద్ధమైన పరీక్షావిధానాన్ని ప్రవేశపెట్టటం; కనీసం 10,000 ఉన్నత పాఠశాలల్ని అన్ని వసతులతో, ఆధునిక బోధనా పద్ధతులతో ఏర్పాటు చేయటం; ఉపాధ్యాయులని, తల్లిదండ్రులని విద్యాసంస్థల నిర్వహణలో భాగస్వాములని చేయటం; విద్యని ఓ బృహత్తర ఉద్యమంగా చేపటట్టం; 12 సంవత్సరాలపాటు నిర్బంధ ఉచిత విద్య అందరికీ అందించే ఏర్పాటు చేయటం; స్కూలు పూర్తయ్యేనాటికి మాతృభాషతో పాటు ఇంగ్లీషు మీద గట్టిపట్టు ఉండటం; పై తరగతులలో ఇంగ్లీషు మాధ్యమంలో విద్యాబోధన చేస్తూ, అవసరాన్ని బట్టి మాతృభాషలో నేర్పటం; విద్యాప్రమాణాల పర్యవేక్షణకి పటిష్ఠయంత్రాగాన్ని ఏర్పరచటం - ఇవన్నీ అందరికీ మంచి విద్య అందించటంలో కీలకమయిన అంశాలు కావాలి. లోక్‌సత్తా పార్టీ ఈ రకమయిన ఎజెండాని చేపట్టి ప్రతి బిడ్డకి అత్యున్నత ప్రమాణాల విద్యనందించటానికి కట్టుబడి ఉంది.

ప్రభుత్వం ఈ ప్రైవేటీకరణకి స్వస్తి చెప్పాలని, హేతుబద్ధమయిన విధానాలతో పాఠశాల విద్యకి ప్రభుత్వరంగంలో పెద్ద పీట వెయ్యాలని, లక్షలాది బీదకుటుంబాల పిల్లలకి ఉచితంగా, ఉన్నత ప్రమాణాల విద్య అందించేందుకు పూనుకోవాలని లోక్‌సత్తా పార్టీ కోరుతున్నది. ఇంతటి కీలకమయిన రంగంలో సరయిన విధానాలు చేపట్టటానికి అనువుగా ఒక విధానపత్రాన్ని రూపొందించి పార్టీలలోను, పౌర సమాజంలోను బహిరంగ చర్చకి దోహదం చేయాలని లోక్‌సత్తా పార్టీ కోరుతున్నది.

**(జయప్రకాష్ నారాయణ్)**

జాతీయ సమన్వయకర్త